క్లుప్తంగా

ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు సన్మానం

మార్కాపురం టౌన్: స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామివారి దేవస్థానంలో ఈనెల 16వ తేన నిర్వహించనున్న రథసప్తమి వేడుకలకు హాజరుకావాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబును మంగళవారం మార్కాపురంలోని ఆయన నివాసంలో ఆలయ ప్రతినిధులు యక్కలి కాశీవిశ్వనాథం, రామదుగు రమేష్, ఊటుకూరి రామకృష్ణ తదితరులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అలాగే 18వ తేదీన గిద్దలూరులో పాతాళ నాగేశ్వరస్వామి రథోత్సవానికి హాజరుకావాలని ఎమ్మెల్యే అన్నాను ఆలయ చైర్మన్ ఆహ్వానించారు.

వైఎస్సార్ సీపీకి రుణపడి ఉన్న క్రైస్తవులు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని క్రైస్తవులకు శ్మశాన వాటిక కోసం స్థలాన్ని మంజూరు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి క్రైస్తవులు రుణపడి ఉంటారని క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు గోన రంజీత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు శ్మశాన స్థలాన్ని చట్టిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం తమ సమస్యను పట్టించుకోలేదని, నేడు జగనన్న ప్రభుత్వం క్రైస్తవులకు అనాదిగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశారన్నారు. ఆ శ్మశాన స్థలంలో ప్రతి ఒక్కరూ క్రైస్తవుడు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

సాయిచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

గిద్దలూరు రూరల్: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం నిర్వహించిన డిగ్రీ సెమిస్టర్-1 పరీక్షలో పట్టణానికి చెందిన శ్రీ సాయిచైతన్య డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కళాశాల కరస్పాండెంట్ జి.రంగస్వామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థుల్లో పి.సాహిలా, కె.నెలోఫర్, ఈ.మౌనిక, షేక్ నజీహతసీమా, పి.నవ్య, షేక్ రసూల్‌బీ, ఈ.సమీరా, ఎం.విష్ణువర్ధన్‌లు ఉన్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందించారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి: సన్న జీవాల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ పురుశోత్తం రాజు సూచించారు. స్థానిక పశు వైద్యశాలలో ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి మండలాలకు చెందిన పశు పోషకులు, రైతులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. పురుషోత్తం రాజు మాట్లాడుతూ వేసవిలో యాజమాన్య పద్ధతులు, పునరుత్పత్తిని పెంపొందించుకోవడం, వ్యాధి నిరోధక టీకాలు, సాధారణ వ్యాధుల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఉపయోగించుకుని లబ్ధి పొందాలని సూచించారు. పశు వైద్యులు శ్రీనివాసరెడ్డి, బసవయ్య, నాగమణి పాల్గొన్నారు.


జగనన్న లేఔట్లు రిజిస్ట్రేషన్



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు

దొనకొండ: స్థానిక సచివాలయం-1లో రెండు రోజుల నుంచి అధికారులు జగనన్న లేఔట్లను లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, వీఆర్‌ఓ హరినారాయణ సమక్షంలో 106 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేశారు. ఇంకా 84 మంది లబ్ధిదారులకు రెండు మూడు రోజుల్లో రిజిస్ట్రేషన్ చేస్తామని సచివాలయ సిబ్బంది తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాధవీలత

ముండ్లమూరు: గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మాధవీలత అన్నారు. మండలంలోని పూరిమెట్లలో ఫ్యామిలీ ఫిజిషియన్ మెడికల్ క్యాంపును ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసి రోగులను గుర్తించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేయాలన్నారు. అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ వైద్యసేవలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మురుగు నిల్వతో సాధారణ జ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయని తెలిపారు. పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకొని ఆరోగ్య సిబ్బంది సేవలందించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఈ కేపీరాజు, సీహెచ్‌ఓ వెంకటరావు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- పేదలంతా పక్కా వైఎస్సార్ సీపీనే
- చంద్రబాబు పాలనలో విసిగిపోయిన ప్రజలు
- రాష్ట్రం బాగుండాలంటే జగన్ ముఖ్యమంత్రి కావాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఇన్‌చార్జి డాక్టర్ శివప్రసాదరెడ్డి



డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మకు హారతి ఇస్తున్న మహిళలు

దర్శి: రాష్ట్రంలో ప్రజలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 12వ వార్డు పుట్టబజారులో మన ఊరు మన శివన్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కురిచేడు రోడ్డు ఆంజనేయ స్వామి, పుట్ట బజారులో పుట్ట, నరసింహ స్వామి, పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలకు ఇంటింటికీ హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. నివాసాల్లో అందుతున్న ప్రభుత్వ పథకాలను అడిగి తెలుసుకున్నారు. మంచంపై ఉన్న వృద్ధులను సైతం ఇంట్లోకి వెళ్లి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి గడపలో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగ క్షేమాలు తెలుసుకుంటూ ప్రచారాన్ని కొనసాగించారు. వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ ఏ ఇంటికి వెళ్లినా అందరూ తమకు వచ్చిన లబ్ధి గురించి వివరించి తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఫ్యాన్ గుర్తుకే గుర్తుపెట్టుకుని మరీ ఓటేస్తామని భరోసా ఇస్తున్నారని చెప్పారు. లబ్ధి చేకూరితేనే ఓటేయండనే దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పేరుతో జన్మభూమి కమిటీలు దోచుకుతిన్నాయని చెప్పారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడల్లా రాష్ట్ర ప్రజలు కరువుతో అల్లాడిపోయారన్నారు. వర్షాలు లేక పంటలు పండక రైతులు కూలీలుగా మారారని గుర్తు చేశారు. చంద్రబాబు వస్తే కరువు వస్తుందని, కరువు రాకుండా ఉండాలంటే చంద్రబాబును రాష్ట్రంలో అడుగు పెట్టకుండా తరిమి కొట్టాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 175కి 175 సీట్లు గెలుపొందటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్యవిభాగం అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, పట్టణ అధ్యక్షుడు కట్టికోట హరీష్, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, ఎస్ఆర్‌ఈడీసీ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, జిల్లా బీసీసెల్ సెక్రటరీ చెరుకూరి జగన్, అన్నవరపు వెంకట రవి, లావునూరి శ్రీనివాసరెడ్డి, శేషం రమణయ్య, పాతెం రహమాన్, శివరాత్రి కోటయ్య, పంట సుబ్బారెడ్డి, కాలేషా, లకారపు సుభాని, షేక్ రహంతుల్లా, కౌన్సిలర్‌లు జగన్నాథం మోహన్‌బాబు, తుళ్లూరి బాబూరావు, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబూరావు, జగన్నాథం మోహన్‌బాబు, మజ్జువలి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ యరమల మధురెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్ రెడ్డి, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రగిరి గురవారెడ్డి, వెన్నపూస బాపిరెడ్డి, కపురం శ్రీనివాసరెడ్డి, ముప్పూరి బ్రహ్మయ్య, కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కేవీ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దామెర్ల చంద్ర, ప్రచార కమిటీ జిల్లా కార్యదర్శి బొమ్మినేని అంకబాబు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గంజి వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కొరివి ముసలయ్య పాల్గొన్నారు.

జంకెకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



మార్కాపురంలో జంకె వెంకటరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



పొదిలిలో జంకెను సత్కరిస్తున్న నాయకులు

మార్కాపురం/పొదిలి రూరల్: ఏపీఐఐసీ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఉదయం ఘనంగా సత్కరించారు. పార్టీ నాయకులు మందటి మహేశ్వరరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బాలసుబ్బారావు, పంబి వెంకటరెడ్డి, శివారెడ్డి, మాజీ ఎంపీపీ ధర్మానాయక్, పత్తి వెంగన్న, రమణారెడ్డి, తర్లుపాడు మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, బూదాల గురవయ్య, గౌస్‌మొహిద్దీన్, సాంబశివారెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు.

ఏపీఐఐసీ చైర్మన్‌గా నియమితులైన జంకె వెంకటరెడ్డికి పొదిలిలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, సింగారెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, కొత్తపులి అంజిరెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను స్థానిక తహసీల్దార్ జి.సిద్ధార్డ్, కమిషనర్ వి.శ్రీనివాసరావులు తమ సిబ్బందితో పట్టణంలోని వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాలను మంగళవారం పరిశీలించారు. ఓటు వేసేందుకు గదులు, అందులో వసతులు ఎలా ఉన్నాయోనని పరిశీలించారు. పోలింగ్ సమయంలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ముందుజాగ్రత్త చర్యలో భాగంగా ఎటువంటి ఏర్పాట్లు చేయాలనే అంశాలపై అధికారులు పరిశీలించారు. వారి వెంట ఎలక్షన్ సిబ్బంది, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు ఉన్నారు.



ఈగలపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై కోటయ్య

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పొదిలి రూరల్: మండలంలోని ఈగలపాడు, పాములపాడు, గొల్లపల్లి, కుంచేపల్లి, ఉన్నగురు వాయుపాలెం, మల్లవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్సై జి.కోటయ్య పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, ర్యాంపులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని ప్రజలకు సూచించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని ఎస్సై కోరారు.

పోలేరమ్మ గుడికి ఫ్యాన్‌ల బహూకరణ



కమిటీ సభ్యులకు ఫ్యాన్‌లు అందజేస్తున్న ఎస్సై, నాయకులు

కురిచేడు: పల్నాడు, ప్రకాశం జిల్లా సరిహద్దు నరసాయాలెం పోలేరమ్మ గుడికి మంగళవారం ఫ్యాన్‌లు బహూకరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కపురం శ్రీనివాసరెడ్డి ఫ్యాన్‌లను ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులకు ఎస్సై సుమన్ చేతుల మీదుగా అందజేశారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి సుపరి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, 2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని, డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని అమ్మవారిని కోరుకున్నారు. ఆయనతో పాటు పడమరవీరాయపాలెం సొసైటీ మాజీ ప్రెసిడెంటు ఊట్ల వెంకటేశ్వర్లు, పడమరవీరాయపాలెం మాజీ ఎంపీటీసీ బొరిగర్ల గోవిందు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నుసుం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఉర్దూ డీఐ

కంభం: మండలంలోని ఎల్.కోట ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ షేక్ మొయినుద్దీన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

బాలోత్సవంలో బాలల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కురిచేడు: ఒంగోలులో ఈ నెల 9,10వ తేదీల్లో ప్రకాశం ప్రథమ బాలోత్సవం నిర్వహించారు. మండలంలోని బోధనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచి ర్యాంకులు సాధించారు. వేమా యశ్వంతి, నాగ బ్రహ్మంజలిలు చిత్రలేఖనంలో తృతీయ, బెస్ట్ ఫ్రం వేస్ట్ అంశంలో ప్రథమ ర్యాంకు సాధించారు. జీలగ హారిక అభినయ గేయాల పోటీలో ప్రథమ ర్యాంకు, ముతుకూరి రుద్ర రమాభారతి చిత్రలేఖనంలో ద్వితీయ ర్యాంకు సాధించారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.పాపారావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది మంగళవారం అభినందించారు.

కేజీబీవీలో అనాథ పిల్లలు



విద్యార్థులు, చిన్నాన్నతో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నీలోఫర్

బేస్తవారిపేట: తల్లిదండ్రులు మరణించడంతో చదువు మధ్యలో నిలిపివేసిన పిల్లలను కస్తూరిబా గురుకుల పాఠశాలల్లో చేర్పించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ నీలోఫర్ చెప్పారు. మండలంలోని జేబీకే పురంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ముగ్గురు విద్యార్థులు భావన ఏడో తరగతి, ఆరవీటి యశ్వంత్ ఆరో తరగతి, కీర్తన ఐదో తరగతి చదువుతున్నారు. భావన చదువు మధ్యలో నిలిపివేసి కూలి పనులకు వెళ్తూ ఇద్దరు చిన్న పిల్లలకు అండగా నిలిచింది. ముగ్గురు పిల్లలు బాబాయ్ ఆరవీటి వెంకటరమణ సంరక్షణలో ఉన్నారు. భావన, కీర్తనను కేజీబీవీలో చేర్పిస్తామని పిల్లల చిన్నాన్నకు తెలపడంతో ఆయన అంగీకరించారు. పాఠశాల హెచ్‌ఎం కె. కృష్ణయ్య, మహిళా పోలీస్ కె.శృతి, వీఆర్వో డి.భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త పి.నాగమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మార్కాపురం సీఐ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మార్కాపురం: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ పరమేశ్వర రెడ్డిని మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు మంగళవారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మార్కాపురంలో శాంతి భద్రతల నిర్వహణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర అంశాలపై ఎస్పీ సూచనలిచ్చినట్లు సీఐ తెలిపారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి



మాట్లాడుతున్న పీడీ అన్నపూర్ణ, అధికారులు

మార్కాపురం రూరల్: వ్యవసాయంలో శాస్త్రవేత్తల సలహాలు పాటించి నాణ్యమైన దిగుబడి సాధించాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణ సూచించారు. మంగళవారం మార్కాపురం సబ్ డివిజన్‌లోని మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు మండలాల వ్యవసాయ శాస్త్రవేత్తలతో ఆమె ముఖాముఖి నిర్వహించారు. కంది పంటలో వచ్చే గూడపురుగు, ఎండు తెగులు, పత్తి పంటలో వచ్చే గులాబీ పురుగు, సమగ్ర యాజమాన్య పద్ధతులు, మిరపలో నల్లతామర, వైరస్ తెగులు నివారణ గురించి ఆమె వివరించారు. భూసార పరీక్షలు సమగ్ర పోషక యాజమాన్య, సమగ్ర పురుగుల యాజమాన్య పద్ధతుల ద్వారా నాణ్యమైన దిగుబడి పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు సీహెచ్ రమాదేవి, ఐదు మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భారత బంద్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

మార్కాపురం టౌన్: ఉభయ రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించనున్న గ్రామీణ భారత బంద్‌ను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో రైతు సంఘ నాయకుడు అందె నాసరయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు భారత్ బంద్ చేపట్టినట్లు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు సీహెచ్ రంగారావు మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లాను కరువు జిల్లాగా, వెనుకబడిన జిల్లాగా ప్రకటించి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పమిడి వెంకటరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి బాలనాగయ్య, రైతు సంఘం నాయకులు తిరుపతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, కొండయ్య, ఏడుకొండలు, డీకే ఎం రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



ప్రతిష్టకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు

కురిచేడు: మండలంలోని దేకనకొండ సింగరయ్య కొండ వద్ద మంగళవారం శ్రీ అర్ధనారీశ్వర, విజయనాగలింగేశ్వర కాశీ శివలింగం, జంటనాగుల విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం కైలాసగిరి మహాస్వాముల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కొండ వద్ద ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం వద్ద నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. మంగళవారం ఉదయం జీవ కళాన్యాసములు, యంత్రాభిషేకములు, యంత్ర స్థాపన, గర్తన్యాసము, నవరత్న పంచలోహ దవ పాశాన నవధాన్యసమర్పణ, బింబప్రతిష్ట, మహాపూర్ణాహుతి, అష్టబంధనం, మహా కుంభాభిషేకం, గోదర్పణ, బాలకన్యదంపతీ దర్శనం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం వరపూజ, శాంతికళ్యాణం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.

విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు



సన్మానం అందుకుంటున్న గౌతంరెడ్డి

బేస్తవారిపేట: ఖాజీపురంలో పూనూరు పెద్ద బాలిరెడ్డి ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి, వినాయక విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. మూలయంత్ర జపాదులు, విగ్రహాల గ్రామోత్సవం, దీక్షాహోమాలు, యంత్రాలకు అభిషేకాలు, మహానైవేద్యం, విగ్రహాలకు మహాస్నపనం, యంత్రాలకు కుంకుమార్చన, శయ్యాధివాసం, పుష్పాదివాసం, ధాన్యాదివాసం, మంగళహారతి పూజలు చేశారు. ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ట్రైనీ డీఎస్పీ, సీఐలకు సన్మానం

కంభం: మార్కాపురం ట్రైనీ డీఎస్పీ షేక్ షబ్బాజ్ అహ్మద్, ఇటీవల నూతనంగా కంభం సీఐగా బాధ్యతలు చేపట్టిన జె.రామకోటయ్యను మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అర్ధవీడు జెడ్పీటీసీ చెన్ను విజయ, బేస్తవారిపేట ఎంపీపీ ఓసురారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కామూరి రమణారెడ్డి, అక్కి పుల్లారెడ్డి, రామనారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డి, రమ, వెంకటేశ్వర్లు నాయక్ పాల్గొన్నారు.



ట్రైనీ డీఎస్పీని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళేశ్వర్

రాచర్ల: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళేశ్వర్ అన్నారు. మండలంలోని జేపీ చెరువు, చోళ్లవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం అకస్మాత్తుగా తనిఖీ చేసి విద్యార్థులకు తగు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పదో తరగతి పరీక్షల్లో ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులను ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు వివరించారు. ఈ రెండు పాఠశాలల్లో ఎనిమిది, తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అందజేసిన జగనన్న ట్యాబ్‌లను బైజూస్ కంటెంటును ఏ విధంగా ఉపయోగించుకోవాలో అనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో గిరిధర శర్మ పాల్గొన్నారు.